సర్కారు నిర్లక్ష్యం..
విద్యారంగం అస్తవ్యస్తం

- సర్కారు బడుల్లో వెక్కిరిస్తున్న నాడు–నేడు పెండింగ్ పనులు
- పాఠశాలల విలీనం, బదిలీలతో గందరగోళాలు
- పాఠశాలలకు ప్రారంభమై 40 రోజులైనా ఉపాధ్యాయులు పోస్టింగ్‌పై తర్జనభర్జన
- సమస్యలు వదిలేసి పేరెంట్ మీటింగ్స్ పేరుతో మభ్యపెట్టే ప్రయత్నం
- ప్రభుత్వం తీరుపై సర్వత్రా విమర్శలు


వెలిగండ్ల మండలం గణేశునిపల్లి పాఠశాలలో 80 మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్


మంగంపల్లిలో పాఠశాల విలీనంపై తల్లి దండ్రుల నిరసనలు(ఫైల్)

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత విద్యా రంగం అస్తవ్యస్తంగా మారింది. సంస్కరణల పేరుతో తీసుకున్న నిర్ణయాలు గందరగోళానికి దారితీశాయి. విలీనం పేరుతో అనేక ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులను మోడల్ స్కూల్ అంటూ సమీప పాఠశాలలకు మార్పు చేశారు. అనేక ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఊరి పాఠశాలలను మార్చవద్దంటూ నిరసన తెలియజేసినా పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు చేసేశారు. మరో పక్క బదిలీ పుణ్యమా అంటూ అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. బదిలీల ప్రక్రియల్లో జరిగిన గందరగోళాలతో అనేక చోట్ల రిలీవర్లు లేక.. ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణలతో జరిగిన ఖాళీలు భర్తీ కాక విద్యా వ్యవస్థ చిందరవందరగా మారింది. నాడు–నేడు పనులు ఎక్కడికక్కడ నిలిచి మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం ఆర్భాటంగా పేరెంట్స్ కమిటీ సమావేశాల పేరుతో మభ్యపెట్టేందుకు ప్రయత్నించింది.

తల్లిదండ్రుల నిరసనలు..

ఈ నెల 10న మెగా పేరెంట్ కమిటీ కార్యక్రమాలకు స్పందన కరువైంది. నియోజకవర్గంలోని 458 పాఠశాలల్లో తల్లిదండ్రులు అంతంతమాత్రంగానే హాజరయ్యారు. హెచ్ఎంపాడు మండలంలో మూడు పాఠశాలల్లో విద్యార్థుల తల్లి దండ్రులు తమ పాఠశాలలను వేరే పాఠశాలకు విలీనం చేయవద్దని నిరసనకు దిగారు. మంగంపల్లి పాఠశాలలోని సుమారు 25 మంది విద్యార్థులను నందనవనం మోడల్ స్కూల్‌కు పంపాలని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు పేరెంట్ కమిటీ సమావేశంలో కూర్చోకుండా తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. తమ పిల్లలను మంగంపల్లి పాఠశాలలోనే ఉంచాలంటూ హెచ్ఎంను, టీచర్‌లను నిలదీశారు. నందనవరం పాఠశాలకు రెండు కి.మీ దూరం నడిచి వెళ్లాలని, మార్గ మధ్యంలో చెరువు గట్టుపై వెళ్లాలని తమ పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసి సమావేశాన్ని బహిష్కరించారు. రసీదు పురం, కూటగుండ్ల పాఠశాలలను విలీనం చేయవద్దని తల్లిదండ్రులు నిరసనకు దిగారు. మా ఊరి పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో సుమారు 1.5 కి.మీ దూరంలో ఉన్న బడుల్లోకి ఎందుకు విలీనం చేశారని అభ్యంతరం వ్యక్తం చేశారు. వెలిగండ్ల మండలం గణేశునిపల్లిలో ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో సుమారు 80 మంది విద్యార్థులు ఉన్నారు.

ఇక్కడ ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంది. కానీ గత ఏడాది నుంచి నల్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో హెచ్ఎం ఉద్యోగ విరమణ చేయగా, మరో ఇద్దరు టీచర్లు బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లారు. కొత్తగా ఇక్కడకు బదిలీపై ఎవరూ రాలేదు. దీంతో ఒకే ఒక టీచర్ 80 మంది విద్యార్థులతో పాఠశాలను నడిపించాల్సిన దుస్థితి. ప్రభుత్వం చేపట్టిన అసంబద్ధ సంస్కరణల వల్ల అనేక చోట్ల ఇలా పరిస్థితులున్నాయి.

ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు మొగ్గు..

గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను విలీనం పేరుతో పక్క గ్రామాల్లోని పాఠశాలలను కలపడం పిల్లలకు ఇబ్బందులకు తెచ్చి పెట్టింది. పిల్లలను కిలో మీటర్ల దూరం పంపేందుకు ఇష్ట పడని తల్లి దండ్రులు ప్రైవేట్ బడుల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. తగిన ఆర్థిక స్థోమత లేని వారు పిల్ల విద్యను సగంలో నిలుపుదల చేస్తున్నారు.

బిల్లుల పరిస్థితి ఏంటి..?

మెగా పేరెంట్ కమిటీ సమావేశాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు బిల్లులు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. సకాలంలో ఎండీఎం బిల్లులు మంజూరు కాక అల్లాడుతున్న కుకింగ్ ఏజెన్సీలకు ఇది అదనపు భారంగా మారింది.

ఆగిన నాడు– నేడు పనులు..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొదటి విడతలో నాడు నేడు కింద 161 పాఠశాలలకు గాను రూ.35.40కోట్లు ఖర్చు చేశారు. రెండో విడత నాడు– నేడు పథకం కింద 127 పాఠశాలలు ఎంపికయ్యాయి. దానికి సంబంధించి గత ప్రభుత్వంలో రూ.55.20 కోట్లు నిధులు మంజూరు కాగా అందులో రూ 29.04 కోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి.


కనిగిరి: నిలిచిన నాడు నేడు పాఠశాల భవనాలు

క్లుప్తంగా

ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోండి

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నాడని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.జయరాం కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదే విధంగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, ఉపాధ్యాయునిపై శాఖపర విచారణ చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను సంబంధించి తనను కాపాడాలని సదరు వ్యాయామ ఉపాధ్యాయుడు మంత్రి స్వామిని కలిసినట్లు జయరాం ఆరోపిస్తున్నారు. దీంతో మంత్రి స్వామిని కలవడంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, ఏపీటీఎఫ్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌బాబు అన్నారు. స్థానిక మెయిన్ స్కూల్‌లో సోమవారం ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న మండల కౌన్సిల్ సమావేశం స్థానిక వడ్డెపాలెం పాఠశాలలో జరుగుతుందని, ఉపాధ్యాయులంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు డి.సుబ్బరాయుడు, జి.రామకృష్ణ, జి.శ్రీహరి, ఎలికా శ్రీనివాసులు, సీహెచ్.చంద్రశేఖర్, బత్తుల రవీంద్ర, సతీష్, యస్.వహిద్, మస్తాన్‌వలి, దండే శ్రీనివాసులు, నన్నసాని గాంధీ, ఎస్వీ నారాయణ, ఇండ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి


నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పీసీపల్లి: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోటయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అనుమానితుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అతివేగం వల్ల ఎంతో మంది మరణిస్తున్నారని గుర్తు చేశారు.


ప్రతిభ చాటిన వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థులు


మితుకుల జయలక్ష్మి


అంబవరపు నందిని

కనిగిరిరూరల్: ఆంధ్రకేసరి యూనివర్సిటీ డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక వైష్ణవి మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. బీఎస్సీ హానర్స్ జువాలజీలో మితుకుల జయలక్ష్మి 9.66/10 మార్కులు, బీసీఏ హానర్స్‌లో అంబవరపు నందిని 9.15 /10, బీకాం కంప్యూటర్స్‌లో అల్లు భవాని 9.12 /12, బీఎస్సీ హానర్స్ బోటనీలో నారబోయిన గాయత్రి 9.40/10 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించండి


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఉలవపాడు: అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పట్టించుకోకుండా పనిభారం మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం వినతిపత్రాన్ని సీడీపీఓ మాధవీలతకు అందజేశారు. ఇందిరావతి, వాకాలతారెడ్డి, సెక్టార్ లీడర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

269 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 269 బేళ్లు తిరస్కరించినట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1042 బేళ్లను తీసుకురాగా 773 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.211.94గా నమోదైంది. వేలంలో 22 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో 771 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 896 బేళ్లను తీసుకురాగా 125 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.199.9గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి సమావేశం

టంగుటూరు: వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం, బాబు షూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఒంగోలు రోడ్డులోని బేసైడ్ ఫంక్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

మద్దిపాడు: మండలంలోని కూచిపూడి, కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ ఎంవీవీ రంగయ్య తెలిపారు. కూచిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రెండవ కౌన్సెలింగ్‌లో ఒంగోలు క్యాంపస్‌కు చిలకల ఐశ్వర్య ఎంపికైంది. కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి శివరాయునిపేట గ్రామానికి చెందిన కొమ్ము వైష్ణవి నూజువీడు క్యాంపస్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ఎంఈఓ రంగయ్య, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ హాస్టల్ మూసేస్తే ఉపేక్షించం


ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత, ప్రజా, బీసీ సంఘాల నాయకులు

- హాస్టల్‌ను కనిగిరిలోనే కొనసాగించాలి
- కనిగిరిలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

కనిగిరిరూరల్: పట్టణంలోని ఎస్సీ 2 బాలుర వసతి గృహాన్ని తీసివేస్తే ఉపేక్షించేది లేదని దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన, స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ ధర్మపోరాట సమితి రాష్ట్ర నాయకుడు చదలవాడ బాలగురవయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకట రత్నం మాట్లాడారు. ఎక్కువ మంది దళిత, పేద విద్యార్థులు కనిగిరిలో విద్యను అభ్యసిస్తుంటారని తెలిపారు. వారికి భోజన వసతి, సౌకర్యాల కల్పనకు 1970లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కనిగిరిలో రెండు హాస్టల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సీ–1 హాస్టల్‌ను గతంలో కనిగిరికి పది కి.మీ దూరంలో ఉన్న కంచర్లవారిపల్లికి తరలించారని, ఎస్సీ 2 బాలుర హాస్టల్ ఒక్కటే కనిగిరిలో ఉందని దీనిని కూడా వెలిగండ్ల మండలం పందువ నాగులవరానికి తరలించే ప్రయత్నాలు అధికారులు చేస్తున్నారని, ఇది సరైంది కాదని తీవ్రంగా ధ్వజమెత్తారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డికి అందజేశారు. బీటీఏ నాయకుడు శివ కాశయ్య, వెంగయ్య, న్యాయవాది చింతంగుంట్ల కిషోర్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దమ్ము వెంకటేష్, నాయకులు జీపీ రామారావు, పవన్ కళ్యాణ్, కటికల అగస్టీన్, విజయ రామరాజు, ఖాజా, చెరుకూరి చిన కాశయ్య, పందిటి కొండ చిన్నయ్య, శాంతరాజు, దమ్ము శ్రీను, దద్దాల రాములు, పలుకూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మీరు చెప్పేసిపోండి.. మేం మాట్లాడుకొని చెబుతాం

ఉలవపాడు: ' మీరు ఏం చెప్పాలనుకుంటున్నారో చెప్పండి. మేమంతా మాట్లాడుకొని తర్వాత చెబుతాం. మా మీద కోపం పడబాకండి ' అని రామకృష్ణాపురం గిరిజనుల తరపున శేషమ్మ అనే మహిళ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు తెలియచేశారు. మండల పరిధిలోని కరేడు పంచాయతీ రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామాల్లో సోమవారం సుపరిపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి ప్యాకేజీ ఇస్తామని, ఇళ్లు కట్టి ఇచ్చిన తర్వాతే ఖాళీ చేస్తామని తెలియజేశారు. కానీ కార్యక్రమం ఉందని ముందుగానే వామపక్షాలు, అనుబంధ సంఘాల్లో ఉన్న రామకృష్ణాపురం మహిళలను మాత్రం ఈ సమావేశంలో ప్రశ్నిస్తారని అక్కడకు రాకుండా ఆపివేశారని వామపక్ష నాయకులు అంటున్నారు.


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న శేషమ్మ

చినుకు పడితే చిమ్మ చీకట్లే..!

- అంధకారంలో గ్రామాలు
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

ఉలవపాడు: చినుకు పడితే చాలు గంటల పాటు విద్యుత్ ఉండని పరిస్థితి. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది కానీ గాలులు లేవు. కానీ సాయంత్రం 5 గంటలకు పోయిన విద్యుత్ రాత్రి 12 గంటలకు వచ్చింది. దాదాపు 7 గంటల పాటు విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత రెండు నెలలుగా చిన్న చినుకులు, ఈదురుగాలులు స్వల్పంగా వీచినా గంటల తరబడి విద్యుత్ నిలిచిపోతుంది. కొన్నిసార్లు రాత్రంతా విద్యుత్ ఉండడంలేదు. మండల కేంద్రంలో విద్యుత్ లైన్లు దాదాపు 40 ఏళ్ల క్రితం ఏర్పాటుచేశారు. అప్పటి నుండి విద్యుత్ తీగలు కనీసం మార్చలేదు. ఇటీవల కాలంలో మెయిన్‌రోడ్ లో విద్యుత్ తీగలు తెగిపడిన సంఘటనలు ఉన్నాయి. ఉలవపాడుకు పొలాల నుంచి వచ్చే విద్యుత్ తీగలు తరచూ తెగిపడుతున్నాయి. వాటికి మరమ్మతులు చేసేందుకు గంటల సమయం తీసుకుంటున్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం...

ఉలవపాడుకు విద్యుత్ సరఫరాలో ఆ శాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఉలవపాడు మండలానికి ఏఈ లేరు. దాదాపు 5 నెలల క్రితం ఇక్కడ పనిచేస్తున్న ఏఈ శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. అప్పటి నుండి కొత్త ఏఈని నియమించలేదు. పై అధికారి లేకపోవడంతో కింద సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారు. విద్యుత్ పోయినా కూడా వెంటనే బాధ్యతగా పనిచేసి సరఫరా పునరుద్ధరించడం లేదు. నిర్లక్ష్యధోరణి కనిపిస్తుంది. విద్యుత్ లైన్లకు అడ్డం గా ఉన్న చెట్లను తొలగించడంలో కూడా నిర్లక్ష్యం కనిపిస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఉలవపాడులో విద్యుత్ సరఫరా సక్రమంగా అందించాలని కోరుతున్నారు.

అటవీశాఖ అదుపులో కరేడు వాసి

ఉలవపాడు:

తిరుపతి అటవీశాఖ అధికారులు కరేడుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తిరుపతి అటవీశాఖ అధికారులు సోమవారం కరేడు గ్రామానికి వచ్చి లంకా వినోద్ అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఎందుకు తీసుకెళ్లారనే విషయం పూర్తిగా తెలియదు. అతనితో పాటు మరికొందరిని కూడా అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎర్రచందనం దుంగలు స్థానికంగా ఉన్న కార్పెంటర్ల తో కలసి ముక్కలు చేసే వ్యాపారం చేస్తున్నాడని, అందువల్లే అటవీశాఖ అధికారులు తీసుకుని వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు దుర్మార్గమైన చర్య


దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు దుర్మార్గమైన చర్య అని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. కేవలం కక్ష్య పూరిత వైఖరితో.. రాజకీయాలతోనే కూటమి సర్కార్ ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా లిక్కర్ కేసులో అరెస్టు చేశారని తీవ్రంగా మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించాలనే లక్ష్యంతోనే సీఎం చంద్రబాబు కుట్ర పూరిత వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. అసలు ఎక్సైజ్ శాఖతో సంబంధం లేని వ్యక్తి అని, ఆయనకు లిక్కర్ పాలసీలో ఎటువంటి పాత్ర లేదని, అయినా తప్పుడు ఆరోపణలు, బలవంతపు ఒప్పందాలు, అధికార దుర్వినియోగం ద్వారా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అక్రమ కేసుల నమోదు రెడ్‌బుక్ కుట్రలో భాగమేనని తీవ్రంగా ధ్వజమెత్తారు. అక్రమ కేసులు, అరెస్టులకు భయపడే వారు ఎవరూ లేరని దద్దాల స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సు, మినీ వ్యాన్ ఢీ

- తప్పిన ప్రమాదం


ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, మినీ వ్యాన్

కొండపి: ఆర్టీసీ బస్సు, మినీ వ్యాన్ ఢీకొన్న ఘటన సోమవారం చోడవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొండపి నుంచి టంగుటూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, టంగుటూరు వైపు నుంచి కొండపి వస్తున్న మినీ వ్యాన్ చోడవరం మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. బస్సు ముందు భాగం ధ్వంసమై డ్రైవర్ చేతికి గాయమైంది. బస్సులోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంతో గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లను గురయ్యారు.

ప్రభుత్వమే స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి


అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

కందుకూరు: లింగసముద్రం మండలంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టు ప్రయత్నాలు మానుకొని ప్రభుత్వమే స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఖనిజ సంపదను స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. లింగసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ఐరన్‌ఓర్ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారని, ఇక్కడ జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థానిక తహసీల్దార్ ద్వారా భూములను గుర్తిస్తూ నివేదిక ఇచ్చారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రైవేట్ వ్యక్తులకు ఖనిజ సంపద లీజును ఇవ్వడం వల్ల వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారీతిన తవ్వకాలు చేస్తే ఆ ప్రాంతంలో గ్రామాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వమే నేరుగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తే స్థానికులకు మేలు జరుగుతుందని, ఉద్యోగాలు స్థానిక యువతకు వస్తాయన్నారు. అలా కాకుండా కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడం వల్ల స్థానికులకు ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉండదన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, సీపీఎం నాయకుడు ఎస్‌ఏ గౌస్, కందుకూరు అభివృద్ధి మండలి ఉపాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ విద్యావతి

లింగసముద్రం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ విద్యావతి అన్నారు. స్థానిక బీసీస హాస్టల్‌ను సోమవారం సందర్శించి వైద్య శిబిరం నిర్వహించారు. హాస్టల్‌లో విద్యార్థులను పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యావతి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. సీహెచ్ఓ జి.శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ మృదుల, శ్రీహరి, కాసింబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌సెల్‌కు నాలుగు అర్జీలు

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ నయిం అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు నాలుగు అర్జీలు వచ్చాయి. భూ సర్వే చేయాలని రెండు, పొలం ఆన్‌లైన్ చేయాలని రెండు అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

ఓ సామాజిక వర్గంపై కక్ష సాధింపు

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి చెందిన రెడ్డి సామాజికవర్గంపై అక్రమ కేసులు బనాయిస్తూ జైలు పాలు చేస్తుందని పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వంటి ముఖ్య నాయకులను, కె.ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి వంటి అధికారులతో చాలా మందిని టార్గెట్ చేసి చంద్రబాబు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండటమే ఇందుకు కారణమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మద్యం స్కామ్‌లో చంద్రబాబు అడ్డంగా దొరికారని, నేడు వీధివీధినా బెల్టుషాపులు కారణంగా మద్యం ఏరులై పారుతుందని ఆరోపించారు. అదే జగనన్న ప్రభుత్వంలో పారదర్శకంగా మద్యం దుకాణాలు నిర్వహించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు


హనుమంతునిపాడు: మండలంలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. జానీబాషా, ఎలిక శ్రీనివాసులు, కోటేశ్వరరావు, నిర్మలలను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ పెద్దిరాజు, ఎస్ రమణ్య, హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ


తనిఖీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలోని గిరిజన గురుకుల సంక్షేమ వసతి గృహాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు జరుగుతున్న మెను పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని పరిశుభ్రతను మరుగుదొడ్ల నిర్వహణ తీరును పరిశీలించారు. హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి సూచనలు, సలహాలు ఇచ్చారు.

కంపు కొడుతున్న కనిగిరి


రోడ్ల పైకి చేరిన చెత్త

కనిగిరిరూరల్: ఓ వైపు పారిశుధ్య కార్మికుల సమ్మె.. మరో వైపు వర్షంతో పట్టణ ప్రధాన వీధులు, కార్యాలయాల సముదాయాలు వర్షం నీటితో చిత్తడి చిత్తగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రధానంగా గార్లపేట రోడ్డు నుంచి నాజ్ సెంటర్ వరకు ఉన్న సైడు కాలువ పొంగి పొర్లుతుండటంతో మురికి నీటిలో నుంచే నడక సాగించాల్సిన దుస్థితి. ఇక ప్రధాన కార్యాలయాల సముదాయాలు వర్షం నీటి నిల్వలతో దర్శనమిస్తున్నాయి. ఆర్డీఓ, తహసీల్దార్, వ్యవసాయ, అంగన్‌వాడీ, సబ్‌రిజిస్టర్, ట్రెజరరీ, వెలుగు, ఇలా అనేక కార్యాలయాలు ఉన్న ప్రాంతం తటాకాలను తలపిస్తున్నాయి. కార్మికుల సమ్మెతో ఎక్కడి ప్రధాన రోడ్లలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.

పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు

ఉలవపాడు: మండల పరిధిలోని రామకృష్ణాపురంలో ఎమ్మెల్యే ఇంటూరినాగేశ్వరరావు పర్యటన సందర్భంగా సీపీఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భూ సేకరణకు వ్యతిరేకంగా వామపక్షాలు రామకృష్ణాపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుండడంతో సీఐటీయూ నాయకులు జి. వెంకటేశ్వర్లు, సీపీఎం ఉలవపాడు మండల కార్యదర్శి జీవీబీ కుమార్, సీపీఎం కందుకూరు పట్టణ కార్యదర్శి గౌస్‌ను అదుపులోనికి తీసుకున్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం పూర్తయి కందుకూరుకు వెళ్లిన తరువాత వారిని స్టేషన్ నుంచి సంతకాలు చేయించుకుని పంపించారు.